క్లుప్తంగా

సీఐ దయాకర్‌ను కలిసిన నాయకులు



ఎస్‌ఎస్‌తాడ్వాయి: పస్రా సీఐ దయాకర్‌ను బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు మంగళ వారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండ లంలోని బందాల మాజీ సర్పంచ్ మోహన్ రావు, ఊరట్టం మాజీ సర్పంచ్ గొంది శ్రీధర్, నాయకుడు సిద్దబోయిన శివరాజ్ సీఐని కలిసి శాలువాలతో సన్మానించారు. మండలంలోని స్థానిక సమస్యలను సీఐకి వివరించారు.

చలితీవ్రతతో వృద్ధుడి మృతి


రాజమల్లు(ఫైల్)

ములుగు రూరల్: చలి తీవ్రత తట్టుకోలేక వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని రాంనగర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాంనగర్ గ్రామానికి చెందిన చింతపట్ల రాజమల్లు కుమారుడు సాంబయ్యకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో పక్కనే షెడ్ ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నారు. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్ర పోయాడు. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి చలితీవ్రత పెరగడంతో రాజమల్లు(60) తట్టుకోలేక మృతి చెందాడని తెలిపారు. ఉదయం కుమారుడు తండ్రిని లేపే ప్రయత్నం చేయగా మృతి చెంది ఉన్నాడని అన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ

పలిమెల: ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను విచారించి కొత్త, ఇదివరకే ఉన్న రేషన్ కార్డులల్లో మార్పులు, చేర్పుల విచారణ చేపట్టి అర్హులైన లబ్ధిదారులందరికీ రేషన్ కార్డులను పంపిణీ చేపట్టినట్లు తహసీల్దార్ అనిల్ మంగళవారం తెలిపారు. దీంతో మండలంలో ఇప్పటి వరకు 382 కొత్త రేషన్ కార్డులు అందించినట్లు తెలిపారు. అలాగే రేషన్ కార్డులల్లో 605 మందిని జోడించడం పేర్కొన్నారు. ఇంకా ఏవరైనా అర్హులు రేషన్ కార్డు దరఖాస్తు చేసుకొని వారుంటే వెంటనే సమీపంలోని మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కమిటీ ఎన్నిక

భూపాలపల్లి రూరల్: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అడ్‌హక్ కమిటీని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మంగళవారం ప్రకటించారు. కమిటీ కన్వీనర్‌గా పెండ్యాల రంజిత్, కో-కన్వీనర్లుగా రాజేందర్, మార్క మురళీకృష్ణ, దేంచనాల తిరుపతి, సభ్యులుగా సల్పాల తిరుపతి, మేశినేని పూర్ణచందర్ రావు, బత్తుల మహేష్, దేవేందర్‌చారి తదితరులు ఎన్నికయ్యారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కాటారం: కాటారం మండలం విలాసాగర్ మానేరు వాగు నుంచి భూపాలపల్లికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను మంగళవారం మండలంలోని మేడిపల్లి టోల్‌గేట్ వద్ద పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఎలాంటి అనుమతులు లేకుండా అధిక ధరలకు విక్రయించడం కోసం ఆరు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. ఇందులో మండలంలోని గంగారానికి చెందిన రెండు ట్రాక్టర్లు, భూపాలపల్లికి చెందిన నాలుగు ట్రాక్టర్లుగా గుర్తించారు. ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

బీజేపీలో చేరిక

కాటారం: మహాముత్తారం మండలం మీనాజీపేటకు చెందిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు మంగళవారం బీజేపీలో చేరారు. కాటారం మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. మంథని ప్రజల ఓట్లతో గెలిచి మంత్రి అయిన శ్రీధర్‌బాబు ఈ ప్రాంత ప్రజల సమస్యలను పట్టించుకోకుండా హైదరాబాద్‌కు పరిమితమయ్యారని ఆరోపించారు. గ్రామస్థాయి నుంచి బీజేపీ బలోపేతం అవుతుందని కేంద్రంలో బీజేపీ పాలనకు ఆకర్షితులపై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో నూతనంగా చేరిన వారిలో దేవేందర్‌రెడ్డి, సమ్మయ్య, రమేశ్, స్వామి, రాయమల్లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం మండల ఇన్‌చార్జ్ సంపత్, మాజీ సర్పంచ్ రాజు, మండల అధ్యక్షుడు పాగె రంజిత్‌కుమార్, దుర్గం తిరుపతి, బండం మల్లారెడ్డి, శ్రీశైలం, బొంతల రవి, చీర్ల బాపురెడ్డి, లక్కునాయక్, రాజేశ్, కిషోర్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక డ్రెయినేజీ ఏర్పాటు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని ఎస్టీకాలనీలో వర్షపునీరు ఇళ్లలోకి వస్తున్నా యి. దీంతో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ స్పందించి మంగళవారం తాత్కాలికంగా మట్టిని తవ్వి డ్రెయినేజీ ఏర్పాటు చేశారు.

పెరుగుతున్న గోదావరి


పూసూరు, ఎడ్జర్లపల్లి మధ్య నీట మునిగిన రహదారి


పేరూరు వద్ద బ్రిడ్జి పైకి చేరిన వరద నీరు

- నీట మునిగిన రహదారులు
- నిలిచిన రాకపోకలు

వాజేడు: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో గోదావరి పెరుగుతుంది. దీంతో మండలంలో పలు చోట్ల రహదారులు ముంపునకు గురి కావడంతో పలు గ్రామాలకు రాక పోకలు నిలిచి పోయాయి. మండల పరిధిలోని పేరూరు, కృష్ణాపురం గ్రామాల మధ్యన మోడి కుంట వాగు ద్వారా రహదారిపైకి వరద నీరు చేరడంతో కృష్ణాపురం, కడేకల్, పెద గంగారం, చంద్రుపట్ల, టేకులగూడెం, టేకులగూడెం కాలనీ గ్రామాలకు పేరూరుకు రాక పోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామాల ప్రజలు పేరూరుకు రావాలంటే జాతీయ రహదారిపై నుంచి చుట్టూ తిరిగి రావాల్సి ఉంటుంది. అదే విధంగా మండల కేంద్రం సమీపంలో కొంగాల వాగు ద్వారా వచ్చిన గోదావరి రహదారిని ముంచింది. దీంతో వాజేడు, గుమ్మడి దొడ్డి గ్రామాల మధ్యన రాకపోకలు ఆగాయి. కొంగాల వాగు అవతల ఉన్న సుమారు 25 గ్రామాల ప్రజలు వాజేడు మండల కేంద్రానికి రావాలంటే జగన్నాథపురం మీదు నుంచి రావాల్సి ఉంది. మండల పరిధిలోని పూసూరు, ఏడ్జర్లపల్లి గ్రామాల మధ్యన ఉన్న వంతెన పైకి వరద నీరు చేరడంతో ఇక్కడ కూడా రాక పోకలు నిలిచిపోయాయి. ఏడ్జర్లపల్లి, బొమ్మన పల్లి, ముత్తారం, కొత్తూరు గ్రామాల ప్రజలు చుట్టూ తిరిగి వెంకటాపురం(కె) మీదుగా వాజేడుకు రావాల్సి ఉంటుంది. కోయ వీరాపురం గ్రామ సమీపంలో చాకలి వాగు వద్ద గోదావరి రహదారి పైకి చేరడంతో గ్రామస్తులు చీకుపల్లి మీదుగా ప్రయాణించాల్సి వస్తుంది.


వరదను పరిశీలిస్తున్న అధికారులు

అధికారులు అప్రమత్తం..

గోదావరి వరద ఇంకా పెరుగుతుండటంతో పాటు పలు చోట్ల రహదారులను ముంచెత్తడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. వెంకటాపురం (కె) సీఐ ముత్యం రమేశ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు, వాజేడు, పేరూరు ఎస్సైలు జక్కుల సతీష్, కృష్ణ ప్రసాద్, ఆర్‌ఐ కుమార స్వామి వరద పరిస్థితిని పరిశీలించారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని ఎక్కడికక్కడ అప్రమత్తం చేయడంతో పాటు రహదారుల పైకి వరద నీరు చేరడంతో నీటిలోకి ఎవరు వెళ్లకుండా కర్రలతో అడ్డుగా కట్టారు.


వరద నీటిలోకి వెళ్లకుండా అడ్డుగా పెట్టిన ట్రాక్టర్, కర్రలు

ఇసుక క్వారీ వద్ద పడిగాపులు

వాజేడు: మండల పరిధిలోని టేకులగూడెం ఇసుక క్వారీ వద్ద ఐదు రోజులుగా పడి గాపులు పడుతున్నా ఇసుక నింపడం లేదని లారీల యజమానులు, డ్రైవర్లు ఆరోపించారు. డీడీలు తీసుకొని వస్తే ఇదిగో అదిగో అంటు రోజులు వెళ్లదీస్తున్నారని మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్‌ను, ఆర్‌ఐ కుమర స్వామిని కలిసి తెలిపారు. లారీల్లో ఇసుక నింపక పోవడంతో 40 కిలో మీటర్ల దూరం తిరిగి వెళ్లామని ఫోన్ చేసి ఇసుక నింపుతామని చెప్పి మళ్లీ రప్పించి నింపడం లేదని వారికి విన్నవించారు. స్పందించిన తహసీల్దార్ టీజీఎంఎస్ ఏడీతో ఫోన్‌లో మాట్లాడి లారీల్లో ఇసుక నింపి పంపేలా చూడాలని లేదా వేరే క్వారీకి లారీలను పంపించాలని చెప్పారు.


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న లారీ యజమానులు

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ములుగు రూరల్: విద్యుత్ ప్రమాదలపై ప్రజ లు అప్రమత్తంగా ఉండాలని ములుగు డివిజన ల్ అధికారి నాగేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. తడి చేతులతో విద్యు త్ తీగలు, స్విచ్‌లను తాకొద్దని అన్నారు. ఇంటి వద్ద బట్టలు ఆరవేసే క్రమంలో దండెంలకు విద్యుత్ తీగలు తగలకుండా చూసుకోవాలని అన్నారు. ఎలక్ట్రిక్ పరికరాలను వినియోగించిన తరువాత స్విచ్ ఆఫ్ చేయాలని అన్నారు. విద్యుత్ తీగలు తెగిపడిన క్రమంలో వాటికి దూరంగా ఉండాలని సమస్యలు ఎదురైతే 1912 నంబర్‌కు లేదా విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని అన్నారు.

ఇళ్లు ఇస్తేనే పునరావాస కేంద్రానికి వస్తాం..


పునరావాస కేంద్రంలోకి రావాలని నచ్చజెబుతున్న ఎస్సై సతీశ్


పునరావాస కేంద్రానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న అధికారులు

- ముంపు ప్రాంతవాసులను ఆవేదన
- నచ్చజెప్పి తీసుకెళ్లిన అధికారులు

వాజేడు: గోదావరి వరద పెరుగుతుండడతో ముంపు ప్రాంతవాసులను అధికారులు పునరావాస కేంద్రానికి మంగళవారం తరలించారు. ఈ సమయంలో రామాలయం సమీపంలోని కొన్ని కుటుంబాల వారిని అధికారులు పునరావాస కేంద్రానికి రావాలని ట్రాక్టర్‌ను పంపించారు. కానీ వారు ట్రాక్టర్ ఎక్కకుండా పునరావాస కేంద్రానికి నడిచి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముంపు ప్రాంతంలో ఉన్న తమకు కాకుండా వేరే వారికి ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చారని ప్రతీ సంవత్సరం గోదావరి వరద వస్తే తమను పునరావాస కేంద్రానికి తీసుకు వచ్చి భోజనం పెట్టి పంపిస్తున్నారని అన్నారు. కూలికి వెళితేనే కడుపు నిండే తమకు ఇళ్లు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ఇళ్లు ఇస్తామని ప్రకటిస్తేనే పునరావాస కేంద్రంలోకి వస్తామని బయటే ఉన్నారు. దీంతో ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు, వాజేడు ఎస్సై సతీశ్ వచ్చి వారితో మాట్లాడి ముంపు ప్రాంతంలో ఉన్న వారి పేర్లు తీసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నడుచుకుందామని చెప్పారు. దీంతో వారంతా పునరావాస కేంద్రంలో బస చేశారు.

సమస్యలు పరిష్కరించాలి


వైద్యురాలికి వినతిపత్రం ఇస్తున్న ఆశవర్కర్లు

వాజేడు: తమ సమస్యలను పరిష్కరించాలని ఆశ వర్కర్లు మంగళవారం సీఐటీయూ జిల్లా నాయకుడు రఘుపతిరావు ఆధ్వర్యంలో వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలికి వినతిపత్రం అందజేశారు. ఆశ వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18వేలు నిర్ణయించాలని తెలిపారు. ఆశాలకు పని భారం తగ్గించి పారితోషకం లేని పనులు చేయించకూడదని అన్నారు.

బాధ్యతల స్వీకరణ

కన్నాయిగూడెం: మండల ఎంఈఓగా వాసం సాంబశివరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంఈఓగా విధులు నిర్వహించిన శ్రీనివాస్ పదవీ విరమణ పొందడంతో జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వాసం సాంబశివరావుకు బాధ్యతలు అప్పగించారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు


ఎస్సీకాలనీవాసులతో మాట్లాడుతున్న అధికారులు


పునరావాస కేంద్రానికి తరలివెళ్తున్న ప్రజలు

ఏటూరునాగారం: గోదావరి వరద ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో మండలంలోని ఎస్సీ కాలనీ, ఓడవాడ ప్రాంతాల్లోని ముంపు ప్రాంతాల ప్రజలను మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లోకి పునరావాస కేంద్రాలకు తహసీల్దార్ జగదీశ్వర్, సీఐ శ్రీనివాస్ మంగళవారం తరలించారు. గోదావరి మొదటి, రెండో ప్రమాద హెచ్చరికకు చేరువలో ప్రవహిస్తుండడంతో ఏదైనా ప్రమాదం జరగవచ్చని ముందస్తుగా ప్రజలను తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే తమకు ఎలాంటి భయం లేదని, ఇక్కడే ఉంటామని అధికారులతో ముంపు ప్రజలు వాగ్వాదానికి దిగారు. కాగా వారికి అధికారులు నచ్చజెప్పి పోలీసులు బందోబస్తు మధ్య పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, సిబ్బంది సుధాకర్, వెంకన్న, రాంబాబు, దయాకర్, లక్ష్మీనారాయణ, మినాజ్ పాల్గొన్నారు.

'అంబేడ్కర్ అభయహస్తం' అమలు చేయాలి

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేయాలని దళితబంధు సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కోగిల మహేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళిత బంధు నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో 18 నెలలుగా జమ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను మోసం చేస్తుందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో దళితులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మడికొండ రమేష్, సంజీవ, ఎనగందుల మొగిలి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోగిల మహేశ్

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మొగుళ్లపల్లి: హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద సెప్టెంబర్ 1న పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల అధ్యక్షుడు పోలు నాగరాజు ఆధ్వర్యంలో మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దు

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు

ఏటూరునాగారం: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను అధైర్య పడొద్దని ప్రభుత్వం ఆదుకుంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మంగళవారం మండలంలోని శివాపురం, చిన్నబోయినపల్లి, గోగుపల్లి ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పర్యటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మంత్రి సీతక్క దృష్టికి ఇక్కడ జరిగిన నష్టం, దెబ్బతిన్న భూముల విషయాలను వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వంతో మాట్లాడి పరిహారం ఇచ్చేవిధంగా చూస్తామన్నారు. ఏఈఓలు రాజు, రవితో పాటు నాయకులు కలిసి రైతుల వద్దకు వెళ్లి వారి వివరాలను సేకరించినట్లు తెలిపారు. రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారులతో సర్వేలు చేయిచనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ మండల అధికార ప్రతినిధి లాలయ్య, చేల వినయ్, ఈసం నర్సయ్య, శేఖర్‌రెడ్డి, రాజేష్, ఠాగూర్, రాకేష్ పాల్గొన్నారు.


పొలాల్లో ఇసుకమేటలను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- వైద్యాధికారి జ్యోతి

వెంకటాపురం(కె): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి జ్యోతి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చొక్కాల, వెంకటాపురంలో వైద్య సిబ్బంది వైద్యశిబిరాలను నిర్వహించారు. గ్రామస్తుకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. అనంతరం సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే ఆరోగ్య మహిళా కేంద్రంలో 74 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు అశీష్, పవన్, సిబ్బంది యాకమ్మ, హెచ్ఈఓ కోటిరెడ్డి, తదితరులు ఉన్నారు.


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి జ్యోతి

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం


కన్నాయిగూడెం: దాగురే చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు


వెంకటాపురం(కె)లో..

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త ఫొటోగ్రఫీ పితామహుడు, లూయిస్ మండే డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటాపురం, వాజేడు మండలాల ఫొటోగ్రాఫార్లు చంద్రకళ, రాగం సాంబశివరావు, వంకాయల రాము, పానెం సతీస్, రవీందర్, ప్రసాద్, రంజిత్, కిషోర్, అశోక్ తదితరులు ఉన్నారు.

కన్నాయిగూడెం: మండల ఫొటోగ్రాఫర్ల యూనియన్ నాయకులు మండల కేంద్రంలో ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుధాకర్ నర్సింహారావు, శ్రీరాముల సందీప్, వంగరి రాజశకర్, సుగ్గుల రాజు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల పంపిణీ

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండలంలోని మండలతోగు, కొండపర్తి గూడెంలోని గొత్తికోయ పిల్లలకు ఫొటోగ్రాఫర్ వట్టపల్లి అనీల్‌రెడ్డి మంగళవారం పండ్లు, పాదరక్షలు పంపిణీ చేశారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా గూడెంలోని 60 మంది పిల్లలకు అందజేశారు. ఎనగంటి సంజయ్, నిమ్మల బలరాజు, బంది రాజు ఉన్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన


కమలాపురంలో వరద ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు


పునరావాస కేంద్రంలో బాధితులకు భోజన వసతిని పరిశీలిస్తున్న అధికారులు

మంగపేట: మండంలో వర్షం తగ్గడంతో నర్సింహాసాగర్ పునరావాస కేంద్రం నుంచి బాధితులను ఇళ్లకు పంపించారు. కమలాపురంలో పునరావాస కేంద్రాన్ని యథావిధిగా కొనసాగిస్తున్నారు. కమలాపురంలో వరద ముంపునకు గురైన ఇళ్లను తహసీల్దార్ రవీందర్, మండల స్పెషలాఫీసర్ సిద్దార్థ రెడ్డి, ఎంపీడీఓ భద్రు మంగళవారం పరిశీలించారు. ఇళ్లను పరిశీలించి జరిగిన నష్టాన్ని అంచనావేశారు. నష్ట పోయిన బాధితుల వివరాలను నివేదికను ప్రభుత్వానికి అందించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. అనంతరం కమలాపురం జెడ్పీ పాఠశాలలోని పునరావాస కేంద్రంలో బాధితులకు భోజన సదుపాయం, సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్ రావు, ఎంపీఓ పాదిళ్ల శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రధాన రోడ్డు


మండల కేంద్రంలో రైతువేదిక వద్ద ఏర్పడిన గుంత


కోమటిపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలు

మంగపేట: మండల కేంద్రంలోని ఏటూరునాగారం-బూర్గంపాడు ప్రధాన రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి మండల కేంద్రంలోని పొదుమూరు రైతు వేదిక వద్ద రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహించడంతో సైడ్ బర్మ్‌లు కోతకు గురయ్యాయి. పూర్తిగా కొట్టుకుపోవడంతో పాటు పలు చోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. కల్వర్టు పక్కన సుమారు 8 మీటర్ల లోతు వెడల్పుతో ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. వాహనాలు ఏమాత్రం అదుపు తప్పినా గుంతలో పడిపోయే ప్రమాదం ఉంది. అదే విధంగా కోమట్లి పల్లి క్రాస్ రోడ్డు వద్ద ప్రధాన రోడ్డు భారీ గుంత ఏర్పడింది. గుంతకు అడ్డంగా బారికేడ్ పెట్టడంతో వాహనాలు పక్కనుంచి వెళ్తున్నాయి. ప్రధాన రోడ్డుపై వందల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాల రాక పోకలతో రద్దీగా ఉంటుంది. రోడ్డు ప్రమాదకరంగా మారడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. మండల కేంద్రంలో గత ఏడాది క్రితం నుంచి ఇదే ప్రాంతంలో వర్షాలకు తరచుగా రోడ్డు ప్రమాదకరంగా మారుతోంది. సంబంధిత అధికారులు శాశ్వత మరమ్మతు చేపట్టకుండా తూతూ మంత్రంగా మట్టి, కంకరతో కూడిన డస్ట్ పోసి చేతులు దులుపుకుంటున్నారు. కలెక్టర్ స్పందించి శాశ్వత మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పుస్తకాల బహూకరణ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న తిరుపతిరెడ్డి

కాళేశ్వరం: మహదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మొదటి, ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలను పీఏసీఎస్ చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి మంగళవారం బహూకరించారు. నీట్, జేఈఈ, ఎంసెట్‌లకు సంబంధించిన పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేయడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అబ్దుల్ ఘని, రమేశ్, సదానందం, సంధ్యారాణి పాల్గొన్నారు.